సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం, 24, జూన్, 2024



వరిలో సస్యరక్షణ
పలు చోట్ల సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నారుమడి పోసే ముందు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో



పోషకాల పుట్ట.. అజొల్లా
పశువులకు ఎక్కువ శాతం ప్రోటీన్లు గల అజొల్లా దాణా వాడడం ద్వారా ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో



హుండీ లెక్కింపులో చేతివాటం
కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం హుండీల లెక్కింపులో ఎన్ఎంఆర్ ఉద్యోగి చేతివాటం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతన్ని విధుల నుంచి తొలగించారు 8లో

ఇలాగైతే గిట్టుబాటు కాదు?

- వరికి అరకొరగా మద్దతు ధర పెంపు
- 2024–25కి క్వింటాల్‌కు రూ.117 పెంపు
- ఇలాగైతే వరిసాగు కష్టమంటున్న రైతులు



ఆకివీడు: ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పంటల ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఈ ఏడాది కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ.117, కామన్ రకం రూ.97 పెంచుతూ చేసిన ప్రకటనతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి వ్యయం పెరిగిపోతుంటే, పంట ధర మాత్రం కంటి తుడుపుగా పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2024–25లో పెంచిన ధరతో కామన్ రకం క్వింటాల్ ధర రూ.2300, గ్రేడ్ ఏ రకం ధర రూ.2320గా ఉంది. ఇది ఏ మాత్రం రైతుకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. 2018–19 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.200 పెంచింది. అనంతరం గత ఐదేళ్లుగా పెంచిన ధరలు రూ.53 నుంచి రూ. 137 మించలేదు. ఏటా రూ.200 పైగా పెంచితే వెళ్లితే రానున్న రోజుల్లో రైతుకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు

ఉమ్మడి జిల్లాలో 4.53 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు సరాసరి 32 బస్తాలు దిగుబడి రాగా.. రబీలో ఎకరాకూ 46 బస్తాలు వచ్చింది. వరి సాగులో పెట్టుబడి వ్యయం ఏటా పెరిగిపోతుంది. దమ్ము, గట్టులంక పనుల నుంచి మాసూళ్లు చేసి, పండిన పంట మిల్లుకు చేర్చే వరకూ రైతుకు రూ.50 వేల నుంచి రూ. 60 వేలు ఖర్చవుతోంది. ఎకరానికి ఖరీఫ్ సీజన్‌లో 30 బస్తాలు(70 కేజీలు) దిగుబడి వస్తుంది. ఈ లెక్కన ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం విక్రయిస్తు ఎకరానికి రూ. 51,750 మాత్రమే వస్తుంది. సుమారు రూ.8,125 నష్టానికి రైతు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. తేమ, పసిరి, రంగుమారిన, తదితర లోపాల్ని ఎత్తి చూపితే రైతుకు బస్తాకు రూ.200 నుండి రూ.400లు వరకూ కట్ చేస్తున్నారు .

అమలుకు నోచుకోని స్వామినాథన్ సిఫార్సులు

పంట ధరల్ని నిర్ణయించేందుకు ఏర్పాటు చేసిన స్వామినాథన్ కమిషన్ సూచించిన సిఫార్సులు నేటికీ అమలుజేయడంలేదు. వరి సాగుకు అయ్యే వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయించాలని స్వామినాథన్ సిఫార్సు చేశారు.

గత ఐదేళ్లలో కేంద్రం వరికి పెంచిన మద్దతు ధర

సం.	కామన్ రకం	గ్రేడ్ ఏ రకం
2017–18	1,550	1,590
2018–19	1,750	1,770
2019–20	1,815	1,835
2020–21	1,868	1,888
2021–22	1,940	1,960
2022–23	2,040	2,060
2023–24	2,203	2,183
2024–25	2,300	2,320

ఒడిశాలో క్వింటాల్‌కు రూ.3,100

ఒడిశా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ ధర కంటే అదనపు ధర రూ.3,100 క్వింటాల్‌కు చెల్లిస్తుంది. ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీస మద్దతు ధరపై అదనపు ధర చెల్లిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

వరి సాగును ప్రోత్సహించేలా ధర ఉండాలి



ధాన్యానికి మద్దతు ధర ఏ విధంగానూ సరిపోదు. ఇతర పంటలతో పోల్చితే వరి మద్దతు ధర ప్రకటనపై చిన్న చూపు చూస్తున్నారు. వ్యవసాయ సాగు కూడా తగ్గిపోతుంది. ఎరువులు, కూలీల ధరలు, ఇతర పెట్టుబడులు బాగా పెరిగాయి. సాగును ప్రోత్సహించే రీతిలో మద్దతు ధర రూ.190 నుంచి రూ.200 వరకూ పెంచితే కొంత వెసులుబాటు ఉంటుంది.

– మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, ఆకివీడు

కనీసం రూ.200 అదనంగా పెంచాలి



కనీస మద్దతు ఏమాత్రం సరిపోతు. అరకొర ధరల పెంపుతో అన్నదాతకు అవస్థలు తప్పడంలేదు. మద్దతు ధర కనీసం రూ.3 వేలకు పైబడి ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. లేదంటే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ నష్టం వస్తుంది. ఏటా రూ.200 మద్దతు ధర ప్రకటిస్తే కనీసం వెసులుబాటు అవుతుంది.

– మల్లారెడ్డి రంగారావు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కన్వీనర్

ధర పెంపు కంటి తుడుపే



కేంద్రం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. గిట్టుబాటు ధర కల్పించకుండా ఏటా కొంత మొత్తం పెంచి రైతుల కన్నీరు తుడవాలనుకోవడం సరికాదు. అన్నదాతను ఆదుకోవాలంటే మద్దతు ధర పెట్టుబడి వ్యయంపై 50 శాతం అదనంగా ఉండాల్సిందే. మద్దతు ధర అమలులో కూడా లోపాలున్నాయి.

– నంద్యాల చల్లారావు, ఆదర్శ రైతు, కుప్పనపూడి

శ్రేష్ఠలో సత్తా చాటిన విద్యార్థులు



శ్రేష్ఠలో 895వ ర్యాంకు సాధించిన పెదతాడేపల్లి గురుకుల విద్యార్థి హర్షవర్ధన్

తాడేపల్లిగూడెం రూరల్: దేశ వ్యాప్తంగా నిర్వహించే శ్రేష్ఠ పరీక్షలో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షకు 139 మంది విద్యార్థులు హాజరు కాగా, వారంతా ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు ఆదివారం తెలిపారు. పాఠశాల స్థాయిలో సిలరపు హర్షవర్ధన్ 895వ ర్యాంకు సాధించాడన్నారు. మూడు వేల లోపు 40 మంది, నాలుగు వేల లోపు 75 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. వీరిలో 50 మందికి దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్, సీబీఎస్ఈ పాఠశాలల్లో 9, 10వ తరగతుల్లో ఉచిత విద్య, వసతి కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి మహేష్‌కుమార్, డీసీవో భారతిలు అభినందించినట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు.

24న ప్రజల వినతుల స్వీకరణ

భీమవరం(ప్రకాశం చౌక్) : ఈ నెల 24న భీమవరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

న్యూస్‌రీల్

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం

భీమవరం : రాష్ట్ర ప్రభుత్వం 2023 జూలై ఒకటో తేదీ నుంచి పీఆర్సీ అమలు చేయాలని ఏపీటీఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం కోరారు. పీఆర్సీ అమలు ఆలస్యం అవుతున్నందున వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. భీమవరంలో జరిగిన జిల్లా సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ హైస్కూళ్లలో ఇంగ్లీష్ మీడియంతో పాటు, తెలుగు మీడియం కూడా అమలు చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, రాష్ట్ర కౌన్సిలర్ జి.పార్వతీదేవి, జిల్లా కార్యదర్శి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 285.8 మి.మీ. వర్షపాతం

భీమవరం : జిల్లాలోని 20 మండలాల పరిధిలో శనివారం ఉదయం 285.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెంటపాడులో అత్యధికంగా 87 మిల్లీమీటర్లు నమోదుకాగా తాడేపల్లిగూడెంలో 84.8, పాలకోడేరులో 1.2, ఆకివీడులో 4.2, పెనుమంత్రలో 7, పెనుగొండలో 2, ఆచంటలో 1.4, పోడూరులో 1.6, భీమవరంలో 5.8, తణుకులో 52.4, అత్తిలిలో 12.4, ఇరగవరంలో 26 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారి ట్రస్టుకు రూ.2.02 లక్షల విరాళం



దాత కృష్ణారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు ఆదివారం వేర్వేరుగా రూ. 2,02,232 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా నూజివీడుకు చెందిన వైవీ కృష్ణారావు రూ.1,01,116, గుంటూరుకు చెందిన మువ్వా భగవత్ ప్రసాద్, గంగాధరరావులు రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి భీమవరానికి చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. భీమవరం పట్టణానికి చెందిన వాసుదేవ చక్రవర్తి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి డాక్టర్ వెంకటపతి రాజు పేరిట నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

విద్యార్థుల మేధకు పదును

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం బీవీ రాజు నాలెడ్జ్ సెంటర్ కృషి
- రూ.1.5 కోట్లతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, రోబోటిక్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్
- కుముదవల్లిలో 18 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఫౌండేషన్
- నిర్వహణకు నెలకు రూ. 2.5 లక్షలు వెచ్చిస్తున్న సంస్థ
- ఇంతవరకూ 1,28,991 విద్యార్థులకు శిక్షణ



కెమిస్ట్రీ ల్యాబ్‌లో ప్రయోగాలు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విజ్ఞాన జిజ్ఞాసను పెంచేందుకు బీవీ రాజు ఫౌండేషన్ నిర్విరామ కృషిచేస్తోంది. సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేసుకున్న ఈ ఫౌండేషన్ పేద విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేస్తోంది. సాంకేతికత వైపు వారిని అడుగులు వేయించేందుకు రూ.కోటికి పైగా వెచ్చించి విజ్ఞాన శాస్త్ర పరికరాలతో ఆధునాతన ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. సొంత వ్యయంతో నిత్యం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఇక్కడికి తీసుకువచ్చి ఆధునిక విజ్ఞానాన్ని అర్థమయ్యే రీతిలో అందిస్తోంది.

సిమెంట్ కార్పొరేషన్ ఇండియా చైర్మన్‌గా దేశంలో సిమెంట్ పరిశ్రమ అభివృద్ధికి పాటుపడిన స్వర్గీయ డాక్టర్ భూపతిరాజు విస్సంరాజు (బీవీ రాజు) స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం చెంతనే ఉన్న కుముదవల్లి. పారిశ్రామిక, సేవా రంగాల్లో ఆయన సేవలకుకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో సత్కరించింది. డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ స్థాపించి తన స్వగ్రామం, భీమవరం ప్రాంత అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కోట్లాది రూపాయలు వెచ్చించి ఎనలేని సేవలందించారాయన. విష్ణు విద్యాసంస్థలను స్థాపించి విద్యారంగంలో భీమవరానికి గుర్తింపు తెచ్చారు. ఆయన స్ఫూర్తితో పేద విద్యార్థుల కోసం డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు 2006లో డాక్టర్ బీవీ రాజు నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేశారు.

18 ఏళ్లలో 1,28,991 మందికి శిక్షణ

ఏ రోజు ఏ పాఠశాలలోని ఏ తరగతికి చెందిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చేదీ సంబంధిత హెచ్ఎంలతో ముందుగానే మాట్లాడి టైం టేబుల్ సిద్ధం చేసుకుని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గత 18 విద్యా సంవత్సరాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,28,991 మంది విద్యార్థులకు ల్యాబ్‌లలో శిక్షణ ఇచ్చారు. 10వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన పరీక్షకు శిక్షణ ఇస్తున్నారు. సిబ్బంది జీతభత్యాలు, విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం, ల్యాబ్‌ల నిర్వహణ, ఇతర ఖర్చుల నిమిత్తం నెలకు రూ.2.5 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భీమవరం రూరల్ వెంప జెడ్పీ హైస్కూల్‌లోనూ విద్యార్థుల కోసం ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు.

బాగా చెబుతారు



గత ఏడాది నుంచి ఇక్కడి ల్యాబ్‌కు వస్తున్నాను. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ పుస్తకాల్లోని పాఠాలను ఇక్కడ ప్రయోగాత్మకంగా చాలా బాగా వివరిస్తూ చెబుతారు. కంప్యూటర్ కూడా నేర్పిస్తున్నారు.

– కె.అఖిల, 7వ తరగతి, ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్, భీమవరం

తాతయ్య మాకు స్ఫూర్తి



తాతయ్య స్ఫూర్తితో డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆయన జ్ఞాపకార్థం డాక్టర్ బీవీ రాజు నాలెడ్జ్ సెంటర్‌ను 18 ఏళ్ల క్రితం ప్రారంభించి నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాం.

– కేవీ విష్ణురాజు, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ చైర్మన్



మానవ శరీర నిర్మాణం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

అధునాతన వసతులతో ల్యాబ్‌లు

పాఠ్యాంశాల్లో తప్ప ప్రత్యక్షంగా ప్రయోగాలు చేసే అవకాశం లేని ఆ రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కుముదవల్లిలోని డాక్టర్ బీవీ రాజు నివాసాన్ని నాలెడ్జ్ సెంటర్‌గా అభివృద్ధి చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ల్యాబ్‌లు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, సెకండ్ ఫ్లోర్‌లో రోబోటిక్, మ్యాథ్స్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ కోసం ఫౌండేషన్ రూ.1.5 కోట్ల వరకు వెచ్చించినట్టు అంచనా. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఆధునిక పరికరాలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నారు. భీమవరం, పరిసరాల్లోని 28 మున్సిపల్, మండల పరిషత్ పాఠశాలలకు చెందిన ఆరు నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ ల్యాబ్‌లలో శిక్షణ ఇస్తున్నారు. నాలెడ్జ్ సెంటర్‌కు చెందిన బస్సు ద్వారా విద్యార్థులను వారి పాఠశాల నుంచి ల్యాబ్‌కు తీసుకువచ్చి శిక్షణ అనంతరం తిరిగి వారి పాఠశాలలో తీసుకువెళ్లి దించుతారు. ఈ విధంగా ఉదయం, మధ్యాహ్న సమయంలో రోజుకు రెండు పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పాఠ్యాంశాల్లోని అంశాలను నాలెడ్జ్ సెంటర్‌కు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరిస్తుంటారు. చదివిన దాని కన్నా ప్రత్యక్షంగా చూడటం ద్వారా మరింత సులభంగా నేర్చుకునే వీలు కలుగుతోంది. శిక్షణ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారు.



ఫిజిక్స్ ల్యాబ్‌లో పాఠ్యాంశాలు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

జూలై 7 నుంచి జగన్నాథ రథోత్సవాలు

దశావతారాల్లో దర్శనమివ్వనున్న స్వామివారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామి ఆలయంలో వచ్చేనెల 7 నుంచి 17 వరకు జగన్నాథుడి రథోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఏటా ఈ ఉత్సవాలను చినవెంకన్న దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన దారు విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. రథోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 7న రథ వాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపురోజు 17న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి రథయాత్రగా వెళ్తారు. రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో జగన్నాథ స్వామి రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు.



సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు



రథయాత్రలకు ముస్తాబవుతున్న జగన్నాథుడి రథం

కార్యకర్తలకు అండగా ఉంటాం

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అభిమానులు అధైర్యపడవద్దని ఏ సమస్య వచ్చినా అందరికీ అండగా ఉంటానని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం, నాయకులు పెట్టే ఇబ్బందులకు ఎవ్వరు బయపడొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంటనే అండగా నిలబడతామన్నారు. మండల స్థాయిలో నాయకులంతా కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులే లక్ష్యంగా కూటమి నేతలు దుర్మార్గాలకు పాల్పడుతున్నారని అన్నారు. వేలేరుపాడు మండల నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, కేసగాని శ్రీనివాసగౌడ్‌పై ఇటీవల కూటమి నాయకులు దౌర్జన్యం చెయ్యడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ నాయకులను కలిసి వారికి భరోసా కల్పించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీపీలు అధైర్యపడకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీలు అల్లూరి రామ్మోహన్‌రావు, తెల్లం రమణ, గాలి దుర్గారావు, నాయకులు తెల్లం చిన్నారావు, కొవ్వాసి పోసీరావు, తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

క్లుప్తంగా

రైళ్లలో చోరీలు చేస్తున్న మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి 113 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు ఆదివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. నర్సాపురం పట్టణానికి చెందిన యామన నందినీదేవి అనే మహిళ రైళ్లలో చోరీలు చేస్తుంటుంది. రైల్వే పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, రాజమండ్రి రైల్వే డీఎస్పీ ఎల్.మోహనరావు ఆదేశాలతో బృందంగా ఏర్పడిన రైల్వే పోలీసులు ఆదివారం సాయంత్రం నిడదవోలు వెళ్లే మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో నందినీదేవిని అరెస్టు చేశారు. ఆమె నుంచి తాడేపల్లిగూడెం, భీమవరం రైల్వే పోలీసుస్టేషన్‌లకు సంబంధించి రెండు కేసులలో రూ.3.56 లక్షల విలువైన 113 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని సోమవారం విజయవాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

రాట్నాలమ్మకు విశేష అలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తల్లి

పెదవేగి: రాట్నాలకుంటలో వెలసిన శ్రీరాట్నాలమ్మ అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్ల అమ్మకాలపై రూ.52,900, విరాళాల రూపంలో రూ.14,527, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.30 వేలు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.5,495 కలిపి మొత్తం రూ.1,02,922 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. శ్రీ అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆదివారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

మేలైన దాణా.. అజొల్లా

- పాడి పరిశ్రమ వృద్ధిలో కీలకంగా దాణా
- పశు సంతతి, పాల ఉత్పత్తికి దోహదం
- అజొల్లాలో అత్యధికంగా పోషకాలు
- ఇతర దాణాల కంటే తక్కువ ఖర్చు

పాడి పరిశ్రమ అభివృద్ధిలో మేలైన పశువుల దాణాయే కీలకం. ముఖ్యంగా సమతుల్యతతో కూడిన దాణా పశువుల సంతతి, పాల ఉత్పత్తి పెంచేందుకు దోహదం చేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాలతో సమతుల్యత కలిగిన పశుదాణాలో వాడే వేరుశనగ చెక్క, ప్రత్తి చెక్కలు ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవి. వీటికి ప్రత్యామ్నాయంగా 25 శాతం ప్రోటీన్లు గల అజొల్లా దాణా వాడడం ద్వారా ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులకు సూచిస్తున్నారు.

జంగారెడ్డిగూడెం: అజొల్లా, ఆకుపచ్చ శిలీంద్రపు జాతికి చెందిన మొక్క ఇది నీటిపై తేలుతూ ఉంటుంది. ఎండ బెట్టిన అజొల్లా పొడిలో 25–35 శాతం మాంసకృత్తులు, 10–15 శాతం మినరల్స్, కెరోటిన్, బి–12 విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. పశువులకు తేలికగా జీర్ణమవుతుంది. రోజూ 1.5 నుంచి 2 కిలోల అజొల్లాను పాడి పశువులకు అందిస్తే, పాల దిగుబడిలో 15–20 శాతము వృద్ధి కనిపిస్తుంది. అజొల్లాను దాణాగా వాడటం ద్వారా దాణా ఖర్చు 20–25 శాతం తగ్గడంతో పాటు, పాడి పశువుల్లో వెన్న, పాల శాతం పెరుగుతుంది. గొర్రెలు, మేకలు, పందులు, కుందేళ్లు, కోళ్లకు కూడా అజొల్లా మేతగా వినియోగించవచ్చు. తాజా అజొల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాలతో కలిపి వాడవచ్చు. అజొల్లాను పశువులకు నేరుగా కూడా తినిపించవచ్చును. తద్వారా పశు దాణా వాడకం సగానికి సగం తగ్గించుకునే అవకాశం ఉంది.

పోషకాలు ఎక్కువే

అజొల్లాలో పోషక విలువ ఎక్కువగా ఉంటాయి. జంతువుల పోషణకు అవసరమైన దాదాపు అన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు, ప్రోటీన్లు కలిగి ఉంటుంది. కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలను, విటమిన్–ఎ, బి–12 వంటి విటమిన్లను కూడా అందిస్తుంది. పొడి బరువు ఆధారంగా, ఇందులో 25–35 శాతం ప్రోటీన్, 10–15 శాతం ఖనిజాలు, 7–10 శాతం అమైనో ఆమ్లాలు, బయో–యాక్టివ్ పదార్థాలు, బయో–పాలిమర్‌లు కలిగి ఉంటుంది. అజోల్లాలో ఇనుము, రాగి, మాంగనీస్ వంటి ఖనిజాలు, విటమిన్–ఎ, బి–12తో పాటు క్లోరోఫిల్, కెరోటిన్లు, 4.8–6.7 శాతం పొడి బరువు బట్టి ముడి కొవ్వు ఉంటుంది. అజోల్లాలో కార్బోహైడ్రేట్, కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది.

పెంచే విధానం ఇలా..

రోజూ 4 కిలోల అజొల్లా ఉత్పత్తి చేయుటకు 2.25 బై 1.5 మీటర్ల పరిమాణంలో మూడు తొట్లు తయారు చేసుకోవాలి. ముందుగా భూమిపై కలుపును పూర్తిగా తొలగించి చదును చేయాలి. 10 సెం.మీ. ఎత్తు వచ్చునట్లు ఇటుకలు నిలబెట్టి 2.25 మీటర్ల పొడుగు, 1.5 మీటర్ల వెడల్పు ఉండునట్లు తొట్టి తయారు చేసుకోవాలి. బయటి నుంచి వేర్లు లోనికి రాకుండ ప్లాస్టిక్ సంచులు గోతి లోపల పరచాలి. దీనిపై 150 జీఎస్ఎం మందం గల (2.50 బై 1.8 మీ సైజు గల) ×సిల్పాలిన్ షీట్ పరచాలి. షీట్ చివరలు ఇటుకలపై అంచుల వరకు వచ్చునట్లు చూడాలి. సిల్పాలినేట్ పరచిన తొట్టి లోతు 10 సెం.మీ ఉండాలి. తరువాత 30–35 కిలోల భూసారం గల మట్టిని జల్లెడ పట్టి, ఆ మెత్తని మట్టిని ×షీట్ మీద గోతిలో ఒకే విధంగా ఉండేలా పరచాలి. ఒక చ.మీ.కు మెత్తని మట్టి 10 కిలోలు కావాలి. తరువాత 4–5 కిలోల పరిమాణం గల 2–5 రోజులు నిలువ ఉంచిన పశువుల పేడను 15–20 లీటర్ల నీటిలో కలిపి గుజ్జుగా తయారు చేసి, దీనికి 40 గ్రా. ఖనిజ లవణ మిశ్రమాన్ని మిక్చర్‌ను కలిపి, తొట్టిలోని మట్టిపై పోయాలి. 7–10 సెం.మీ. నీటి స్థాయి ఉండేలా చూడాలి, దీని కొరకు మరింత నీటిని కలపాలి. తరువాత నీటితొట్టిలోని మట్టిని నీటిని కలియ తిప్పాలి. నీటి స్థాయి 7–10 సెం.మీ. ఉండునట్లు చూసి, 1–1.6 కిలోల అజొల్లా విత్తనాలను తొట్టిపై సమానంగా పడేలా చల్లాలి. తరువాత మంచి నీటిని అజొల్లాపై చిలికినట్లయితే అజొల్లా మొక్కలు నిటారుగా నిలుస్తాయి. అజొల్లా త్వరగా వారం రోజుల్లో పెరిగి, గొయ్యి మొత్తాన్ని 7–10 రోజులలో ఆక్రమిస్తుంది. (1 కిలో అజొల్లా నుంచి వారం రోజులలో 8–10 కిలోలు దిగుబడి వస్తుంది). 7వ రోజు నుంచి అజొల్లాను ప్రతి రోజు వాడుకోవచ్చు. ఆ తర్వాత వారాని కొకసారి 1 కిలో పేడను, 20 గ్రా.ల మినరల్ మిక్చర్, 5 లీటర్ల నీటితో కలిపి గుజ్జుగా చేసి, అజొల్లా తొట్టిలో పోయాలి. పూర్తిగా పాడైపోయిన అజొల్లాను, తెగుళ్ల బారిన పడిన అజొల్లాను పూర్తిగా తొలగించి, తాజా అజొల్లాను వేయాలి. చీడ పీడలు ఆశించిన అజొల్లాను, పురుగు మందులు వాడిన అజొల్లాను మేతగా వాడరాదు. 10 రోజుల కొకసారి అజొల్లా తొట్టిలో 4వ వంతు నీటిని తీసివేసి, కొత్త నీటితో మళ్ళీ నింపాలి. 60 రోజుల కొకసారి తొట్టిలోని మట్టిని 5 కేజీలు తొలగించి, తిరిగి 5 కిలోల కొత్త మట్టిని తొట్టినిండా పరచాలి. ప్రతి 6 నెలల కొకసారి మట్టిని, నీటిని, అజొల్లాను తొలగించి, కొత్తగా తయారు చేసిన నీటిని, మట్టిని, అజొల్లాను కొత్తగా వేయాలి.



నీటి తొట్టిలో అజొల్లాను సాగు చేస్తున్న దృశ్యం

రైతుకు లాభదాయకం

రంధ్రాలు గల ప్లాస్టిక్ పలకలో, సేకరించిన అజొల్లాను ఉంచాలి. సగం నీరు నింపిన బకెట్ మీద పలకను ఉంచి, పైనుండి నీటిని పోసి, ఆవు పేడ వాసన పోయేటట్లుగా కడగాలి. అజొల్లా ముక్కలు చిన్న రంధ్రాల ద్వారా బకెట్టు లోనికి వెళతాయి. ఆ నీటిని మరల తొట్టిలో పోయుటవలన అజొల్లా తిరిగి పెరుగుతుంది. అజొల్లాను పశువుల దాణాతో 1:1 నిష్పత్తిలో వాడటం రైతులకు చాలా లాభదాయకం.

పశువులకు ఎంతో మేలు



అజొల్లాలో పోషక విలువ ఎక్కువగా ఉంటాయి. 25 శాతం ప్రోటీన్లు గల అజొల్లా వాడడం వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుంది. అజోల్లా వాడటం వల్ల పాడి పశువుల్లో వెన్నశాతం, పాలశాతం పెరుగుతుంది. గొర్రెలు, మేకలు, పందులు, కుందేళ్ళు, కోళ్ళకు కూడా అజొల్లా మేతగా ఉపయోగపడుతుంది. పశువుల దాణాతో పాటు సమ నిష్పత్తిలో అజోల్లాను వాడటం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. అజోల్లాలో ఇనుము, రాగి, మాంగనీస్ వంటి ఖనిజాలు, విటమిన్–ఎ, బి–12 వంటి పోషకాలు వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

పెద్దింట్లమ్మ హుండీ లెక్కింపులో చేతివాటం



కొల్లేటికోట పెద్దింట్లమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

కై కలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం హుండీల లెక్కింపులో ఎస్ఎంఆర్ ఉద్యోగి చేతివాటం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 19న దేవస్థానం వద్ద 62 రోజుల వ్యవధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను అధికారులు లెక్కించారు. మొత్తం రూ.7,63,487 నగదు ఆదాయం వచ్చిందని తేల్చారు. గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.సుధాకర్, ఆలయ ఈవో కేవీ గోపాలరావుతో పాటు పోలీసు, రెవెన్యూ, అర్చకులు, పెద్దింట్లమ్మ సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు ఇలా దాదాపు 40 మంది సమక్షంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో పాల్గొన్న శృంగవరప్పాడు శివారు గోకర్ణపురం గ్రామానికి చెందిన ఎస్ఎంఆర్ ఉద్యోగి ఏ.సాయిచందు లెక్కింపు సమయంలో కొంత నగదును చుట్ట చుట్టి సమీపంలోకి విసిరివేశారు. ఇది చూసిన ఓ వ్యక్తి లెక్కింపు పూర్తయిన తరువాత ఆలయ ఈవో గోపాలరావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సీసీ కెమెరాలను పరిశీలించగా ఇది నిజమేనని తేలింది. దీంతో అతని వద్ద నుంచి రూ.12 వేలు స్వాధీనం చేసుకుని తిరిగి గ్రామ పెద్దల సమక్షంలో హుండీలో నగదు వేయడం జరిగింది. పెద్దల సమక్షంలో ఈ తంతు జరగడంతో విషయం గోప్యంగా ఉండిపోయింది. మరుసటి రోజు లంక గ్రామాల్లో ఈ విషయం వెలుగుచూడటంతో హుండీల లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన సాయిచందు మరికొంత నగదును కూడా దాచిపెట్టాడని, అతనిపై కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో కేవీ గోపాలరావును వివరణ కోరగా ఎస్ఎంఆర్ సాయి చందు చేతివాటంతో నగదు కాజేయడం నిజమేనన్నారు. అతని వద్ద నుంచి నగదును పెద్దల సమక్షంలో హుండీలో వేయించామన్నారు. విధుల నుంచి పూర్తిగా తొలగించామని చెప్పారు.

కాలువలో బాలుడి గల్లంతు

- పడాల వాసిగా గుర్తింపు
- పడవలపై ముమ్మర గాలింపు



వానపల్లి మణికంఠ (ఫైల్)

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణ పరిధిలోని ఏలూరు కాలువలో కాళ్లు కడుగుకునేందుకు దిగిన ఓ బాలుడు కాలువలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామానికి చెందిన వానపల్లి మణికంఠ అనే పద్నాలుగేళ్ల బాలుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తండ్రి వానపల్లి సూరిబాబు సెలూన్ షాపులో క్షవరం చేయించుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో సైకిల్ పంక్చర్ కావడంతో మరమ్మతు చేయించుకుని వెళుతూ కాళ్లు కడుగుకునేందుకు యాగర్లపల్లి వద్ద కాలువరేవులోకి దిగాడు. అయితే హఠాత్తుగా కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా మణికంఠ కోసం బోటులో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి పడటంతో సోమవారం గాలింపు కొనసాగిస్తామని సీఐ తెలిపారు.



కాలువలో బాలుని కోసం వెదుకుతున్న పోలీసు బోటు

సేవ ద్వారా భగవంతుని ఆశీస్సులు

అత్తిలి: సేవ చేయడం ద్వారా భగవంతుని ఆశీస్సులు పొందవచ్చని శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ అలీషా అన్నారు. బల్లిపాడులోని ఆశ్రమంలో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న రెండో విడత ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో ఉమర్ అలీషా ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సేవ చేయాలని అనుకున్నప్పుడు అనేక అవాంతరాలు, అవరోధాలు ఏర్పడతాయని, వాటిని సాధించాలనే సత్సంకల్పంతో ప్రయాణిస్తూ చక్కటి ఫలితాలు పొందవచ్చన్నారు. మొక్కలు వల్ల కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గత 20 ఏళ్లుగా పీఠం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మూడు మొక్కలు నాటి, తోటివారితో నాటిస్తూ వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ట్రస్టు ద్వారా డాక్టర్ దండు పద్మావతి బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్నో చక్కని సేవలందిస్తున్నారని అభినందించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఉమర్ అలీషా చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అభినందనీయమన్నారు. దండు పద్మావతి మాట్లాడుతూ ట్రస్టు సామాజిక కార్యక్రమాల్లో భాగంగా కుట్టు శిక్షణ ప్రారంభించామన్నారు. గ్రామంలో నిర్వహించే ఉచిత వైద్యానికి సహకరిస్తున్న ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియోపతి కళాశాలవారికి, కుట్టుశిక్షణ ఇస్తున్న గౌసియాబేగం, కట్టాలక్ష్మిని అభినందించారు. తొలివిడత కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఉమర్ అలీషా సర్టిఫికెట్లను అందజేశారు. పర్యావరణంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు ప్రగడ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ ధనుమూరి వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి బాబ్జి, ఆకుల రామచంద్రరావు, ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ ఆకుల బులినాగేశ్వరరావు, పీఠం జిల్లా కన్వీనర్ అడబాల నాగవెంకటరత్నం పాల్గొన్నారు.



బల్లిపాడులో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు కుట్టుమెషీన్‌ను అందజేస్తున్న దృశ్యం

ఆర్చరీ రాష్ట్ర పోటీల్లో శ్రీఆన్‌వర్మకు ద్వితీయ స్థానం



పెన్మెత్స శ్రీఆన్స్‌వర్మ

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన పెన్మెత్స శ్రీఆన్‌వర్మ రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో అండర్–10 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో సత్తా చాటాడు. శ్రీఆన్‌వర్మ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. ఓల్గా ఆర్చరీ అసోసియేషన్ కోచ్ సాహిత్ వద్ద శ్రీఆన్‌వర్మ ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. త్వరలో విజయవాడ లేదా అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో శ్రీఆన్స్‌వర్మ పాల్గొంటారని కోచ్ సాహిత్ చెప్పారు.

11 కాసుల బంగారం చోరీ



బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని సూరపురాజు కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగి 11 కాసుల బంగారపు ఆభరణాలను అపహరించారు. బాధితుడు బోగిరెడ్డి చంద్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21వ తేదీన చంద్రయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఆహోబిలం క్షేత్రాన్ని దర్శించుకునేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 22వ తేదీ రాత్రి సుమారు 8.30 గంటలకు పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వ్యక్తి పి.జయకుమార్.. చంద్రయ్యకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం ఇచ్చాడు. దీంతో అహోబిలం నుంచి బయలుదేరి 23వ తేదీ ఉదయం ఇంటికి చేరుకున్న చంద్రయ్య ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను తెరిచి ఉండటాన్ని గమనించాడు. అలాగే బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని చూసి బీరువాలో దాచిన రెండు బంగారు ముక్కలు, ఒక బంగారు ఉంగరం మొత్తం సుమారు 11 కాసుల విలువైన బంగారం, నగదు కోసం వెతగా అవి కనిపించలేదు. దీంతో వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి పొంగలి, దూపదీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో వర్షం తగ్గిన తర్వాతే భక్తులను ఆలయ కమిటీవారు అనుమతించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, మినీ వ్యాన్‌లలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వరి నారుమడిలో సస్యరక్షణ ఇలా..



తాడేపల్లిగూడెం శివారులో ఏపుగా పెరిగిన వరి నారుమడి



నాట్లు వేస్తున్న కూలీలు

పాడి - పంట

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలు ఉన్నాయి. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే 25 వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నారుమడులు పోశారు. 600 ఎకరాల్లో నాట్లు వేసినట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఇక పెంటపాడు మండలం విషయానికొచ్చే సరికి పది శాతం మాత్రమే నారుమడులు పూర్తయ్యాయి. గణపవరం మండలంలో ఇప్పుడిప్పుడే నారుమడి పోసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే నారుమడి పోసే ముందు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పి.మురళీకృష్ణ సూచిస్తున్నారు.

ఖరీఫ్‌కు అనువైన రకాలు

ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1318, ఎంటీయూ 1239, ఎంటీయూ 1224 (మార్టేరు సాంబ), ఎంటీయూ 1262, బీపీటీ 5204 రకాలను సాగుకు అనువైనవి. ముందుగా రైతులు కిలో విత్తనాలకు కార్బండిజమ్ ఒక గ్రాము చొప్పున తడి విత్తనానికి కలిపి 12 నుంచి 24 గంటలు నానబెట్టి నారుమడి వేసుకోవాలి. ఒక ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనాన్ని ఐదు సెంట్ల మడిలో వేయాలి. బెంగాలీ నాట్లయితే 10 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుంది. నారుమడి ఐదు సెంట్లకు 22 కిలోలు యూరియా, 6.25 కిలోల సూపర్, 1.6 కిలోల పొటాష్ వేసుకోవాలి.

నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నాట్లు వేయడానికి 15 రోజులు ముందుగానే దమ్ము చేయాలి. పవర్ టిల్లర్లు లేదా ట్రాక్టర్‌తో 15 సెంటీమీటర్ల లోతున దమ్ము చేసుకోవాలి. ఎరువులు 36–24–24 ఎన్‌పీకేలు అనగా ఒక ఎకరాకు 80 కిలోల యూరియా మూడు దఫాలుగా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ 150 కిలోలు, 40 కిలోల పొటాష్ రెండు దఫాలుగా నాట్లు వేసిన వరి చేలకు వేయాలి. 20 నుంచి 30 రోజుల నారు ఊడ్చడానికి మంచిది. రెండు, మూడు మొక్కలను రెండు నుంచి మూడు సెంటీ మీటర్ల లోతులో వేసుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్ల కాలిబాటలు తీసుకోవాలి. తద్వారా గాలి, వెలుతురు మొక్కకు బాగా తగులుతుంది. చీడ పీడల బెడద ఉండదు. ఎరువులు, పురుగు మందులు చల్లుకోవడానికి కాలి బాటలు బాగా ఉపయోగపడతాయి.

కలుపు నివారణ

నారుమడిలో ఒకట్రెండు రోజుల్లో ప్రిటిలాక్లోర్ 50 శాతం ఈసీ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలపాలి. ఎకరాకు 400 మిల్లీ లీటర్లు చల్లుకోవాలి. మూడు నుంచి ఐదు రోజుల్లో పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10 శాతం డబ్ల్యూపీ 80 గ్రాములు ఎకరాకు వేసుకోవాలి. 15 నుంచి 20 రోజుల్లో బిస్పిరిబాక్ సోడియం 100 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. నాట్లు వేసిన పొలంలో మూడు నుంచి ఐదు రోజుల్లో పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాములు ఎకరానికి, ఈరోస్ గోల్డ్ 800 గ్రాములు ఎకరాకు, 15 నుంచి 20 రోజుల్లో సెహాల్ ఫాప్‌బ్యూటైల్ 10 శాతం ఈసీ 400 ఎంఎల్ ఎకరాకు చల్లుకోవాలి.

లోతట్టు ప్రాంతాల్లో విత్తన మార్పిడి మంచిది



లోతట్టు ప్రాంత రైతులు స్వర్ణకు బదులుగా ఎంటీయూ 1318 రకం వరి వంగడాన్ని వేసుకోవాలి. ప్రధానంగా తాడేపల్లిగూడెం మండలం నందమూరు, మారంపల్లి, మాధవరం, జగన్నాథపురం, పెంటపాడు మండలం బి.కొండేపాడు, మీనవల్లూరు, చింతపల్లి, గణపవరం మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించాలి. రైతులు త్వరితగతిన నారుమడి పోసుకోవాలి. సాగులో సలహాలు, సూచనలకు ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి.

– పి.మురళీకృష్ణ, ఏడీఏ, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో...



తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టికి శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, ఏఈఓ పి.నటరాజారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

సంచార వైద్యశాలలో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, తణుకు పట్టణం, సజ్జాపురం, దువ్వ, పరిసర గ్రామాల్లోని మంచంపై నుంచి లేవలేని వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, పలు సూచనలు, సలహాలు అందించారు. ఇండియా నెట్ వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీరావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ పట్టాభిషేక మహోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు టౌన్: ఛత్రపతి శివాజీ హిందూ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని తణుకులో ఆదివారం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కోలాట భజనలు, ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగిలిన ఆహార పదార్థాలు వృథా చేయవద్దు



వడలిలో ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

పెనుగొండ: మిగులు ఆహార పదార్థాలు వృథా చేయకుండా అన్నార్థులకు అందించాలనిఅక్షయ పాత్ర సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సిద్ధాంతం గ్రామానికి చెందిన నాదేండ్ల మురళీకృష్ణ నివాసంలో జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలు వృథా కాకుండా వడలి గ్రామానికి చెందిన అక్షయ పాత్రకు సమాచారం అందించడంతో వాటిని తీసుకువచ్చి వడలి ఎన్టీఆర్ కూడలిలో పేదలకు పంపిణీ చేశారు. సమాచారం అందించి అన్నార్తులకు అండగా నిలిచిన గోకవరపు రాజాకు అక్షయ పాత్ర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, మేకా నరసింహ మూర్తిలు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లు అధ్వానం



శిథిలావస్థకు చేరిన కొండాలమ్మగుడి ప్రాంతంలో నిర్మించిన రేవు

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టు పొడవునా నిర్మించిన పుష్కరఘాట్ రేవులు పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలమై అధ్వాన స్థితికి చేరాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి గట్టు పొడవునా పలు చోట్ల పాతరేవుల అభివృద్ధి, కొన్నిచోట్ల కొత్తరేవుల నిర్మించారు. అయితే అప్పట్లో కొన్నిచోట్ల అవసరం లేని ప్రదేశాల్లో కూడా రేవులను దీంతో పుష్కరాల తరువాత జనం వెళ్లని రేవుల పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రేవులు కట్టాక ఆయా ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్తున్నారు. కానీ వలందర్‌రేవు, అమరేశ్వరఘాట్, లలితాంబఘాట్ ఘాట్ తప్పిస్తే మిగిలినచోట్ల నిర్మించిన రేవులు శిథిలమయ్యాయి. మున్సిపల్ అధికారులు కూడా మిగిలిన రేవుల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది.

చెరువులను తలపిస్తున్న చేలు



ఎల్.అగ్రహారం గ్రామంలో నీట మునిగిన వరి నాట్లు



మెట్ట ఉప్పరగూడెం శివారులో నీట మునిగిన వరి చేలు

- నీట మునిగిన నారుమళ్లు
- ఉధృతంగా ప్రవహించిన డ్రెయిన్లు
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గత రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఇటీవల వేసిన నారుమళ్లు నీటమునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అప్పారావుపేట, మోదుగ గుంట, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మాధవరం గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. చేలల్లోని నీటిని గాడులు చేసి దిగువకు మళ్లిస్తున్నారు. డ్రెయిన్లు సైతం పొంగి ప్రవహిస్తున్నాయి. మోదుగగుంట, మెట్ట ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం గ్రామ శివారులో డ్రెయిన్ల కట్టలు తెంచుకుని నాట్లు వేసిన వరి చేలను ముంచెత్తడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి మరీ నారు కొనుగోలు చేశామని, ఇంతలోనే వర్షం ముంచెత్తిందని వాపోతున్నారు. మరలా నారు ఎక్కడి నుంచి తెచ్చేదంటూ వాపోతున్నారు. ఆదిలోనే హంస పాదు అన్న చందంగా రైతుల పరిస్థితి నెలకొంది. కాగా ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచి దానిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కచ్చా డ్రెయిన్లు ద్వారా నీటిని మళ్ళించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండ్రోజుల్లో 127.8 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గత రెండ్రోజుల వ్యవధిలో 127.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం వరకు 43 మిల్లీ మీటర్లు కాగా, ఆదివారం తెల్లవారు జాము 4 గంటల నుంచి ఉదయం వరకు 84.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పెంటపాడు మండలంలో ఆదివారం 87 మిల్లీ మీటర్లు నమోదైందని తాడేపల్లిగూడెం తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు.



చెరువులను తలపిస్తున్న వరి చేలు...



చేలలోని నీటిని దిగువకు మళ్లిస్తున్న దృశ్యం



మోదుగ గుంట శివారులో వరి చేల దుస్థితి

బీవీఆర్ కళాకారుల సేవా కార్యక్రమాలు అభినందనీయం



బీవీఆర్‌లో నెలవారీ సేవా సత్కారం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ: పట్టణంలోని బీవీఆర్ ఆధ్వర్యంలో కళాకారుల నెలవారీ కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆదివారం సాయంత్రం బీవీఆర్ కళాకేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. కళాకారుల ద్వారా ట్రాక్ సింగింగ్, నాట్యాచారిణి శ్రీలతచే కూచిపూడి నృత్య ప్రదర్శన, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వంగపండు రామ్మోహన్‌రావుకు గౌరవ సేవ పురస్కారం, నాట్యాచారిణి ఎ.శ్రీలతకు నాట్య మయూరి పురస్కారం, హాస్యనటులు ఎస్.గంగాధరరావుకు ఆర్థిక సత్కారం చేశారు.

ముగిసిన అభయాంజనేయుని ఆలయ వార్షికోత్సవాలు

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్తంభానికి ఇత్తడి కవచం తొడిగారు. ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో ఈ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వమించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఈ ఇత్తడి కవచం ఏర్పాటు చేశారు. ఇత్తడి కవచం తొడిగిన అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి సన్నాయి మేళం, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం చేశారు.

తాడేపల్లిగూడెంలో భారీ వర్షం



కె.ఎన్.రోడ్డులో కూలిన చెట్టును జేసీబీ సాయంతో తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శనివారం అర్ధరాత్రి ఈదురు గాలులు, భారీ వర్షం కారణంగా పలు పల్లపు ప్రాంతాలు నీటి మునిగాయి. అనేక ప్రాంతాలు బురదతో చిత్తడి చిత్తడిగా మారాయి. బ్రహ్మానందరెడ్డి మార్కెట్, జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలలు ఆవరణలు, అనేక పల్లపు ప్రాంతాల అంతర్గత రహదారులు నీటిలో మునిగాయి. డ్రెయినేజీలలో మురుగు నీరు భారీగా చేరింది. అంతేగాక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, డిపో గ్యారేజీ ఆవరణలో భారీగా నీరు నిలిచిపోయింది. నీరు బయటకు పోయేందుకు మార్గం లేకపోవడంతో వర్షం వస్తే నీరు నిలిచిపోతుందని, పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా పట్టణంలోని కేఎన్ రోడ్డు గొల్లగూడెం సెంటర్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెట్టు పడిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.



ఆర్టీసీ గ్యారేజీ, కాంప్లెక్స్ ఆవరణలో నీరు

అరుణాచల యాత్రతో ఆధ్యాత్మిక అనుభూతి



ఆర్టీసీ బస్సు ద్వారా అరుణాచలం గిరి ప్రదిక్షణ అనంతరం పట్టణానికి చేరుకున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్‌ఆర్టీసీ తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు యాత్రతో ఆధ్యాత్మిక అనుభూతి పొందామని భక్తులు పేర్కొన్నారు. జూన్ 20న గురువారం సాయంత్రం డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు భక్తులతో బయలుదేరి, మార్గంలో శ్రీకాళహస్తి, కాణిపాకం విఘ్నేశ్వర స్వామి క్షేత్రానికి, శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ క్షేత్రాలను దర్శించిన అనంతరం బస్సు ఆదివారం తాడేపల్లిగూడెం చేరింది. ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జి కె.సురేష్‌బాబు, గ్యారేజీ ఇన్‌చార్జి చిట్టిబాబు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రయాణికులు ఎం.జయలక్ష్మి, ఎస్.వాణి, బి.వెంకన్న తదితరులు యాత్ర అనుభవాలను పంచుకున్నారు. గిరి ప్రదక్షిణ, పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు చక్కటి అవకాశం కల్పించిన ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ ద్వారా పుణ్యఫలం లభించిందని చెప్పారు. బస్సు కండిషన్ బాగాందుని, నైపుణ్యం ఉన్న డ్రైవర్లును ఏర్పాటు చేశారని, గైడ్‌గా వ్యవహరించారని అభినందించారు. అంతేగాక వచ్చే నెల జూలై 19వ తేదీన పౌర్ణమి గిరి ప్రదక్షిణకు బయలుదేరే అరుణాచలం ప్రత్యేక సర్వీస్ చార్జీ కేవలం రూ.2600 మాత్రమేనని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు 99592 25488, 99597 53102, 99855 44411 నెంబర్లకు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు.

మానవ సేవ ద్వారానే ఉత్తమ సమాజం



పెంటపాడు మండల మానవత సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా చైర్మన్ మోహనరావు

పెంటపాడు: సమాజానికి మెరుగైన సేవలు అందించే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారానే ఉత్తమ సమాజం సాధ్యమవుతుందని, ఆ సేవలను ప్రతి వారూ స్వాగతించాలని ఆ సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడు మండల సమావేశ మందిరంలో మండల మానవత 2024–25 సంవత్సరానికి నూతన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాలో మానవత పలు శాఖల ద్వారా చేస్తున్న సేవలను వివరించారు. ఈ సేవలను అంచెలంచెలుగా ఇతర రాష్ట్రాలకు విస్తరించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. బతికి ఉన్న సమాజంతో పాటు, మృతి చెందిన వారికి కూడా సేవలందించే ఏకైన సంస్థ మానవత అన్నారు. పెంటపాడు మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మానవత సభ్యులు ఉండాలన్నారు. కెరీర్ గైడెన్స్, విద్య ఉన్నతికి, ఆరోగ్య పరిరక్షణకు, మానవత మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. మండల కార్యాలయ సూపరెండెంట్ టీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మానవత సేవలు అందిస్తున్న సంస్థ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సభ్యులతో మోహనరావు ప్రమాణం చేయించారు. మండల మానవత శాఖ అధ్యక్షుడిగా మీసాల సత్యనారాయణ, కార్యదర్శిగా సత్తారు రాము, కోశాధికారిగా ఏలూరి వీరాస్వామి, ఉపాధ్యక్షులుగా నక్కా సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా విప్పర్తి వినాయకుడు, ఈసీ ఎడ్యుకేషన్ పీబీ శ్రీనివాసాచార్యులు, ఈసీ హెల్త్ కర్రి గిరీష్‌రెడ్డి, ఈసీ ఎవేర్‌నెస్ సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఈసీ ఎమర్జెన్సీగా నల్లమిల్లి ప్రభాకరరెడ్డిలతో మోహనరావు ప్రమాణస్వీకారం చేయించారు.

ఆదర్శనీయుడు.. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తణుకు టౌన్: భారత దేశానికి ఒకే రాజ్యాంగం, ఒకే జెండా ఉండాలని పోరాడుతూ బలిదానమైన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడని తణుకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ముళ్లపూడి రేణుక కోరారు. ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానం దినోత్సవం సందర్భంగా తణుకులోని ముళ్లపూడి రేణుక నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు బీజేపీ సమన్వయకర్త ఐనంపూడి శ్రీదేవి మాట్లాడుతూ భారతదేశ సమగ్రతకు శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ రెండేసి మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుబ్బయ్య, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు వెలిచేటి గోవిందరావు, తాడిపర్రు గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్ర, భూపతిరాజు సుబ్బరాజు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కిరణ్మయి, తణుకు కో కన్వీనర్ పోలిశెట్టి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం ఆదివారం స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. అనంతరం పటేల్ శక్తి కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు, రాష్ట్ర నాయకులు పసుపులేటి వెంకట రామారావు, తుమరాడ చిన్న, శక్తి కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గం ఏర్పాటు



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బోడపాటి

అత్తిలి: స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ భవనంలో అత్తిలి మానవత సేవా సంస్థ సమావేశం బోడపాటి సూర్యచంద్రరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి మానవత సంస్థ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా ఎం.బాలకృష్ణంరాజు ఎన్నికయ్యారు. మానవతా సంస్థ చైర్మన్ ఆనాల ఆదినారాయణరావు, కార్యదర్శి కొరిపల్లి హరి, కో చైర్మన్ తోట వెంకట సుబ్బారావు, కాసగాని హనుమంతరావు, ఆల్తి సత్యనారాయణ, పాల్గొన్నారు.

రేపు వీఆర్‌ఏల జిల్లా సమావేశం

పెనుగొండ: వీఆర్‌ఏల జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 25వ తేదీన పాలకొల్లు ఏఎంసీలో నిర్వహించనున్నట్లు వీఆర్‌ఏల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి గణేశ్వరరావు తెలిపారు. ఆదివారం పెనుగొండలో మాట్లాడుతూ మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వీఆర్‌ఏల డిమాండ్లు, సమస్యలు పరిష్కరించేందుకు చర్చిస్తామని న్నారు. ఉమ్మడి జిలాల్లోని అన్ని డివిజన్లు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమాజ సేవలో యువత ముందుండాలి

మానవత స్టేట్ కన్వీనర్ డాక్టర్ కె.రాధా పుష్పావతి



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు

తణుకు టౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో మహిళలు, యువత ముందుండాలని మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి కోరారు. ఆదివారం రాత్రి తణుకులోని గమిని ఫంక్షన్ హాలులో నిర్వహించిన మానవత సంస్థ పట్టణ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవత సంస్థ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో మహిళలు భాగస్వామ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నండూరి సవిత మాట్లాడుతూ మానవత సంస్థ చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. తణుకు మానవత సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో జిల్లా మానవత సంస్థ శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలిగా కఠారి శారదాదేవి, ఉపాధ్యక్షులుగా కె.రాజరాజేశ్వరరావు, కె.వాణి, కార్యదర్శిగా బొల్లం రామకాశీ, సహాయ కార్యదర్శిగా కేవీ రమణమూర్తి, కోశాధికారిగా అక్కిన కాశీ విశ్వనాథం, ఈసీ ఎవెర్నెస్‌గా ఆర్‌ఎస్‌ఎం భూపాల్, ఈసీ ఎడ్యుకేషన్‌గా టీ రామకృష్ణ, ఈసీ ఎమర్జెన్సీగా ఎస్‌వీ.సతీష్‌బాబు, ఈసీ హెల్త్‌గా డాక్టర్ కె.రామలక్ష్మీ, 10 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మానవత రీజినల్ కన్వీనర్ బోయపాటి రామలక్ష్మీ, దాత చిట్టూరి సుజాత, మాజీ అధ్యక్షుడు ఏ.బాలాజీ, కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి, వనిత క్లబ్ సేవలు అభినందనీయం



గాంధీ విగ్రహం ఆవిష్కరణలో వాసవి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి, వనిత క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాలు మేరకు డాన్ టూ డస్క్ సేవలలో భాగంగా ఆదివారం స్థానిక ఐదో వార్డు ప్రాథమిక పాటశాలకు 1000 లీటర్లు వాటర్ ట్యాంక్, వనిత క్లబ్ వారిచే జాతిపిత గాంధీ విగ్రహం ఏర్పాటు, విగ్రహ ఆవిష్కరణ, స్కూల్ విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ కిట్, స్నాక్స్, దివ్యాంగులకు బ్లైండ్ స్టిక్, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు పెద్ద గొడుగులు, ట్రాఫిక్ పోలీసులకు టవల్స్, మాస్కులు, రైన్ కోటులు, ఇతర సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అంచురి శ్రీనివాస్, సీహెచ్ ప్రసాద్, నున్న బాల త్రిపుర సుందరం, జయవరపు లక్ష్మి, రాజశేఖర్, అలపాటి లక్ష్మి, నున్న ఆనంద్, పి.స్వర్ణ కాంతి, కర్నాటి రంగారావు, వీఆర్ గుప్తా, కె.ప్రభ, బద్రి, రాంపండు, శ్రీనాగలక్ష్మి, సునీత, ఎం .కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



పెనుమంట్రలో ధ్యానంపై శిక్షణ ఇస్తున్న బండి శ్రీనివాసరాజు

పెనుమంట్ర: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరాజు అన్నారు. పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు వెంకటపతిరాజు సాయిగీతలు నిర్మించిన బ్రహ్మర్షి పత్రీజి పిరమిడ్ ధ్యానమందిరంలో హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరాజు ధ్యాన శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం అనేది మానవుడిని మాధవుడిగా తయారు చేస్తుందని, ధ్యానం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పరస్పర అవగాహన పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా పీఎస్‌ఎస్‌ఎం అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు, మధురామకృష్ణ, సతీష్, చక్రపాణి, బి.శ్రీదేవి, యర్రాయమ్మ, భ్రమరాంబ, తులసమ్మ, మార్తాండకుమారి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.